క్లుప్తంగా

రిటైర్డ్ ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు



విజయవాడస్పోర్ట్స్: జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి, కర్తవ్య నిర్వహణలో చిత్తశుద్ధి, అంకిత భావంతో పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు విశిష్ట సేవలందించి మంగళవారం ఉద్యోగ విరమణ చేసిన ఆరుగురు పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఉద్యోగ విరమణ చేసిన కె..వెంకటేశ్వరరావు(ఎస్ఐ), ఎండీగౌస్(ఎస్ఐ), ఎండీ షరీపుల్లా (ఏఎస్ఐ), కె.బాబురావు(ఏఆర్ఎస్ఐ), ఎంవీ భాస్కరరావు (హెడ్‌కానిస్టేబుల్), పి.వెంకటేశ్వరరావు (హెడ్ కానిస్టేబుల్)ను కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డీసీపీ కె.శ్రీనివాసరావు, ఇన్ చార్జ్ అడ్మిన్ డీసీపీ కృష్ణమూర్తి నాయుడు, ఏడీసీపీ టి.కనకరాజు, ఏవో రంగారావు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమయ్య పాల్గొన్నారు.

ఆర్‌బీఐ నిబంధనలపై అవగాహన అవసరం



పెనమలూరు: ప్రతి ఒక్కరూ ఆర్‌బీఐ నిబంధనలు తెలుసుకోవాలని ఆర్‌బీఐ రిసోర్స్‌పర్సన్ డాక్టర్ ఎస్ శ్రీనివాసరావు సూచించారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం ఆర్బీఐ, ఆర్డిక్స్ సంస్థ ఆధ్వర్యాన డిపాజిటర్స్‌పై వర్కుషాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంపై విద్యార్థులు అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. బ్యాంకు ఖాతా తెరవడం, ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవడం, రుణాలు పొందడం, బ్యాంకు ఖాతాతో బీమా ప్రయోజనం, పథకాలపై సబ్సిడీ వివరాలు ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలని అన్నారు. కాలేజీ హెచ్‌ఓడీ డాక్టర్ బేబిరాణి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులకు బ్యాంకు రుణాలు తీసుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా విశ్రాంత అధికారి ఆర్ఎస్.శంకర్‌రావు, ఆర్డిక్స్ సంస్థ ప్రతినిధి వై.సాంబశివరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

న్యాయమూర్తి విజయ్‌కుమార్ రెడ్డి



భవానీపురం(విజయవాడపశ్చిమ): నగర పాలక సంస్థ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కార్పొరేషన్ కోర్ట్ న్యాయమూర్తి బి.విజయ్ కుమార్‌రెడ్డి హెచ్చరించారు. 47వ డివిజన్ పరిధిలోని సర్కిల్-1 కార్యాలయంలో మంగళవారం మొబైల్ కోర్ట్ జరిగింది. సర్కిల్- కార్యాలయం పరిధిలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నమోదు చేసిన 25 కేసులపై ఆయన విచారణ జరిపి రూ.14,730 జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్త పడేసి నగర పరిశుభ్రతకు తూట్లు పొడవద్దని సూచించారు. ఒకసారి జరిమానా విధించాక రెండో సారికూడా అదే తప్పు చేస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ హెల్త్ ఆఫీసర్-1 డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మేనిఫెస్టో అంతా గారడీ

– ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ మునీర్ అహ్మద్

లబ్బీపేట(విజయవాడతూర్పు): తాము అధికారంలోకి వస్తే ఏవేవో చేస్తామంటూ చంద్రబాబు బూటకపు మాటలు చెపుతున్నాడని, వాటిని నమ్మే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలు లేరని ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ మునీర్ అహ్మద్ అన్నారు. ఆయన సోమవారం విజయవాడ లబ్బీపేటలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అధికారం కోసం చంద్రబాబు ఎన్ని హామీలైనా ఇస్తాడని, ఆ తర్వాత వాటన్నింటినీ తుంగలో తొక్కడం ఆయన నైజం అన్నారు. ఆయన 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేశాడని, ఒక్కరికైనా సెంటు ఇంటి స్థలం ఇచ్చాడా అని ప్రశ్నించారు. ఇప్పుడు రెండు సెంట్లు ఇళ్ల స్థలం ఇస్తానంటే ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఆయన విడుదల చేసిన మేనిఫెస్టో అంతా గారడీ అని ప్రజలు భావిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే, శ్రీలంకలాగా మారిపోతుందని చెప్పిన చంద్రబాబు, ఇప్పుడు అవే పథకాలు అమలు చేస్తానంటే ఎలా నమ్మగలం అన్నారు. ముస్లింలను మోసం చేసిన నయవంచకుడు చంద్రబాబు అని ధ్వజమెత్తారు. మతపరమైన రిజర్వేషన్లు తొలగిస్తామంటున్న బీజేపీతో జత కట్టిన చంద్రబాబుకు రాష్ట్రంలోని ముస్లింలు అంతా తగిన రీతిలో బుద్ధిచెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

సెంట్రల్‌లో దూసుకెళ్తున్న వెలంపల్లి

- సకుటుంబ సమేతంగా ఎన్నికల ప్రచారం
- సంక్షేమం, అభివృద్ధే ప్రధానంగా ప్రచారాలు
- ప్రత్యర్థిపై విమర్శనాస్త్రాలు



ప్రచారంలో భాగంగా ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి, నాయకులు(ఫైల్)

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సార్వత్రిక ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల ఘట్టం ముగిసింది. బరిలో నిలిచే అభ్యర్థులెవరో తేలింది. మే 13వ తేదీన జరిగే ఎన్నికల కురుక్షేత్రంలో సెంట్రల్‌లో మొత్తం 20 మంది అభ్యర్థులు పోటీపడతున్నారు. ఎవరెవరికీ మధ్య పోటీ ఉంటుందో ఇప్పటికే తేలిపోయింది. ఎన్నికలకు నిండా పది రోజుల వ్యవధి మాత్రమే ఉండడంతో అభ్యర్థులు ప్రచార వ్యూహ, ప్రతివ్యూహాలు రచిస్తున్నారు. వైఎస్సార్ సీపీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, టీడీపీ అభ్యర్థిగా బొండా ఉమామహేశ్వరరావు, సీపీఎం అభ్యర్థిగా చిగురుపాటి బాబూరావు ఎన్నికల్లో తలపడనున్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు 58 నెలలుగా తమ ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమం, అభివృద్ధినే ప్రచారాస్త్రాలుగా మలచుకోని దూసుకుపోతున్నారు. ప్రభుత్వ పథకాలే ఆయనకు బ్రహ్మాస్త్రంగా మారాయి. సునాయాసంగా గెలుస్తానంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆయన నియోజకవర్గంలోని అన్ని డివిజన్లను చుట్టేశారు. నియోజకవర్గంలో సీఎం వైఎస్ జగన్ మేమంతా సిద్ధం బస్సు యాత్ర జరగడం వెలంపల్లికి అదనపు జోష్ పెంచింది. శ్రేణులు ఎప్పుడెప్పుడు ఎన్నికల తేదీ వస్తుందా అని ఎదురు చూస్తున్నారు. అమ్మ ఒడి మొదలుకొని కాపు నేస్తం వరకు, విద్యా కానుక నుంచి గోరు ముద్ద వరకు ప్రతి పథకాన్ని ప్రస్తావిస్తూ ప్రజలను ఆకట్టుకుంటూ ప్రచారం సాగిస్తున్నారు. డివిజన్లలో లబ్ధిదారులు తమంతటతామే ముందుకు వచ్చి తమకు అందిన సంక్షేమ పథకాలు వివరాలు తెలుపుతూ మళ్లీ వైఎస్ జగన్ను సీఎంను చేసుకుంటామని చెబుతున్నారు. రోడ్లు, పార్కులు, డ్రైయిన్లు అభివృద్ధి తాగునీటి సదుపాయం వంటి విషయాల్లో ప్రజలు నాడు-నేడు అంటూ పోల్చుకుని వైఎస్సార్ సీపీకి అధికారం కట్టబెట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. వెలంపల్లి ఓ వైపు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూనే మరో వైపు ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు ఆరాచకాలను ఎండగడుతున్నారు. 2014–19 మధ్య సాగించిన కాల్‌మనీ సెక్స్ రాకెట్, గుండాయిజం, రౌడీయిజం, బైక్ రేస్‌లు, భూకబ్జాలు ప్రజలకు వివరిస్తూ ముందుకెళ్తున్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల కుటుంబ సభ్యులు

సకుటుంబ సపరివార సమేతంగా ప్రచారం

వెలంపల్లి శ్రీనివాసరావు కుటుంబం మొత్తం ఆయన గెలుపునకు అహర్నిశలు శ్రమిస్తోంది. భార్య, కుమార్తె, అల్లుడు, సోదరులు, ఇతర కుటుంబ సభ్యులు ముమ్మర ప్రచారం సాగిస్తున్నారు. మండుటెండలోనూ ప్రజలను కలుసుకొని వెలంపల్లిని గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. సకుటుంబ సపరివార సమేతంగా ప్రచారం నిర్వహిస్తుండడంతో ఓటర్లు వారిని అక్కున చేర్చుకుంటున్నారు. వీరికి తోడు వైఎస్సార్ సీపీ విజయవాడ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని భార్య, కుమార్తెలు, అల్లుడు ప్రచారం చేస్తున్నారు. వీరి ప్రచారం ప్రత్యర్థులపై ముప్పేట దాడిలా సాగుతోంది. వీరికి తోడు పథకాల లబ్ధిదారులు మేము సైతం అంటూ స్టార్ క్యాంపెయినర్‌లుగా మారారు. సోషల్ మీడియాలో తమకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ వెలంపల్లి, కేశినేని నాని గెలుపు కోసం కృషి చేస్తున్నారు.

చెప్పుకోవడానికి ఏమీ లేక.. ఢీలా పడిన ఉమా

వైఎస్సార్ సీపీ ప్రచారంలో దూసుకెళ్తుంటే టీడీపీ అభ్యర్థి బొండా ఉమా ప్రచారంలో బేలగా కనిపిస్తున్నారు. తాము అధికారంలో ఉండగా చెప్పుకోదగ్గ పథకాలు అమలు చేయలేదు. ఏ ఒక్క పనిచేయలేదు. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. అజిత్‌సింగ్‌నగర్ చెత్త డంపింగ్ యార్డుపై 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీ 2019లో దిగిపోయేవరకు అమలు చేయలేకపోయారు. ఈ ప్రభుత్వం చేసి చూపించడం, ఈ మార్పు ప్రజల కళ్లకు కట్టినట్లు కనిపిస్తుండడంతో చేసేదేమీ లేక ఓట్లు అడిగేందుకు వెళ్లడానికి ఆయన వెనుకాడుతున్నారు. ఏమీ చేయలేకపోయాం.. చెప్పుకోలేక పోతున్నాం అంటూ నిరాశ నిస్పృహలో మునిగిపోయారు. కేడర్‌లోనూ ఉత్సాహం కరువైంది.

వేధిస్తోన్న గాజు గ్లాసు సింబల్

ఈ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి కట్టాయి. కూటమి తరఫున టీడీపీ అభ్యర్థి బొండా ఉమా ఎన్నికల బరిలో ఉన్నారు. జనసేన పార్టీ గుర్తు అయిన గాజు గ్లాసును ఫ్రీ సింబల్‌గా ఎన్నికల కమిషన్ ప్రకటించిన విషయం తెలిసిందే. సెంట్రల్‌లో ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్న గొల్లపల్లి ఫణిరాజ్‌కు ఎన్నికల సంఘం గాజు గ్లాస్ గుర్తు కేటాయించింది. ఇదే ఇప్పుడు టీడీపీ అభ్యర్థికి కొత్త సమస్య తెచ్చిపెట్టింది. గాజు గ్లాసు సింబల్ ప్రభావం తమపై ఉంటుందని టీడీపీ నేతలు తలలు పట్టుకుంటున్నారు. గాజు గ్లాసు పగిలితే పదునెక్కువ అన్న పవన్ కళ్యాణ్ మాటలు గుర్తు చేసుకుంటూ తెలుగు తమ్ముళ్లు మదన పడుతున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం శ్రీ శారదా నృత్య కళాపీఠంకు చెందిన పలువురు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై నాట్యాచార్య సంతోష్ పర్యవేక్షణలో కళాపీఠానికి చెందిన వారు పలు అమ్మవారి కీర్తనలకు నాట్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల అనంతరం నిర్వహించిన నృత్య ప్రదర్శనను పెద్ద ఎత్తున భక్తులు హాజరై వీక్షించారు. అనంతరం నృత్య ప్రదర్శన ఇచ్చిన వారికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందచేశారు.

కేబీఎన్‌లో స్వల్పకాలిక కంప్యూటర్ కోర్సులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కాకరపర్తి భావనారాయణ కళాశాలలో కంప్యూటర్స్ విభాగం ఆధ్వర్యంలో స్వల్పకాలిక కంప్యూటర్ కోర్సులను నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. తక్కువ ఫీజుతో ఈ కోర్సులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంఎస్ ఆఫీస్, టాలీప్రైమ్, కోర్సులను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు నెలల కాలపరిమితితో ఈ కోర్సులను అందిస్తున్నామని తెలిపారు. రోజు ఒక గంట తరగతి బోధనతో పాటుగా మరో గంట ల్యాబ్ సదుపాయాన్ని అందిస్తామన్నారు. 98495 17440 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

63వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం



మహిళలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న వెలంపల్లి

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు పొందుతున్న ప్రజలు మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటామంటున్నారని వైఎస్సార్ సీపీ సెంట్రల్ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం 63వ డివిజన్ పాతరాజీవ్‌నగర్‌లో ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థిగా కేశినేని శ్రీనివాస్‌లను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఆ సందర్భంగా ప్రజలు తమకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని తెలియజేశారు. అనంతరం వెలంపల్లి మాట్లాడుతూ.. గత టీడీపీ పాలనలో ఎమ్మెల్యేగా పని చేసిన బొండా ఉమా ఈ ప్రాంతంలో ప్రజల సమస్యలను పట్టించుకోలేదన్నారు. అలాంటి వ్యక్తికి ప్రజలను ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. నిర్లక్ష్యానికి గురైన 63వ డివిజన్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పిమ్మట కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేశామన్నారు. పర్యటనలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మేడా రమేష్, కో ఆప్షన్ నందెపు జగదీష్, డివిజన్ కో ఆర్డినేటర్ పసుపులేటి యేసు, మోదుగుల గణేష్, టిక్కం కృష్ణ, రాష్ట్ర ముస్లిం, మైనార్టీల జాయింట్ సెక్రటరీ షేక్ నాగుల్‌మీరా, ఉద్దంటి శ్రీనివాసరావు, నాగు యాదవ్, తిరుపతిరావు, నాగిరెడ్డి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వాన్ని నిండు మనసుతో ఆశీర్వదించండి

విస్తృతంగా ఎన్నికల ప్రచారం



31వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న కేశినేని పావని, వెలంపల్లి శ్రీలక్ష్మి, శిరీష



అయోధ్యనగర్‌లో మంచుకొండ చక్రవర్తి, కాజ రఘునాథంను సత్కరిస్తున్న నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కులమతాలు, రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమం, అభివృద్ధి అందించిన జగనన్న ప్రభుత్వాన్ని నిండు మనసుతో ఆశీర్వదించాలని కేశినేని నాని సతీమణి కేశినేని పావని, వెలంపల్లి సోదరుడి సతీమణి వెలంపల్లి శ్రీలక్ష్మి కోరారు. స్థానిక 31వ డివిజన్‌లో మంగళవారం స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీషతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని నాని, వెలంపల్లి శ్రీనివాసరావులను గెలిపించాలని అభ్యర్థించారు. దారి పొడవునా మహిళలు ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని గుర్తు చేసుకుంటూ హారతులిస్తూ ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం తదితరులు పాల్గొన్నారు.

32వ డివిజన్‌లో..

32వ డివిజన్‌లో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అల్లుడు మంచుకొండ చక్రవర్తి, ఎంపీ కేశినేని అల్లుడు కాజా రఘునాథం వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్‌పాల్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అయోధ్యనగర్‌లో ఇంటింటికీ వెళ్లి మంచి చేసిన ప్రభుత్వానికి ఓటు వేయాలని కోరారు. డివిజన్‌లో హారతులిస్తూ, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సాయి అశ్విత, రాందేవ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

27వ డివిజన్‌లో..

27వ డివిజన్ గులాబీతోటలో సిద్ధం శీనన్న కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందించిన ప్రభుత్వ పథకాలను వివరిస్తూ బొట్టుపెట్టి, ఓట్లు అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని చెప్పారు. ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిద్ధం శీనన్న కమిటీ సభ్యులు కురిటి శివ, యర్రంశెట్టి శ్రీను, శీలం భవానీరెడ్డి, కనక లింగేశ్వరరావు, లంక కుమార్, శ్రీధర్, చందు, దుర్గారావు, వంశీ, రవి వర్మ, రాము అప్పారావు, అనిరుద్రుడు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థ, వీవీఐటీ కళాశాలల మధ్య ఒప్పందం



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):తమ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించేందుకు గుంటూరు జిల్లా నంబూరులోని వాసిరెడ్డి వెంకట్రాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలతో ఒప్పందం చేసుకుందని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపల్ ఎం.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వీవీఐటీ కళాశాల ఆవరణలో ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మల్లికార్జునరెడ్డితో మంగళవారం ఒప్పంద పత్రాల మార్పిడి చేసుకున్నామని పేర్కొన్నారు. ఈ ఒప్పందం వల్ల రెండు కళాశాలు సంయుక్తంగా పరిశోధనలు చేయడం, సాంకేతిక సదస్సులు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటుగా పాఠ్య ప్రణాళికలు రూపొందించడం, నూతన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని విద్యార్థులతో పాటుగా అధ్యాపకులకు బోధించడంలో పరస్పరం సహకరించుకుంటామని వివరించారు. సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టీఎస్ రవికిరణ్, వీవీఐటీ కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ వి.రామచంద్రన్, పీబీ సిద్ధార్థ కళాశాల డిగ్రీ కోర్సుల ఇన్‌చార్జ్ కె.సుధీర్‌తోపాటుగా ఇరు కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

'స్ఫూర్తి'లో వేసవి శిక్షణ తరగతులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):పుస్తకాలతో కుస్తీ పట్టి పరీక్షలు రాసి అలసిపోయిన విద్యార్థులకు ఆటవిడుపుగా ఉండేందుకు అలాగే వారిలో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మక శక్తిని గుర్తించి మరింత పదును పెట్టెందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో వేసవి కాలం సందర్భంగా ప్రత్యేకంగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని 'స్ఫూర్తి' క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్రీ హ్యాండ్ డ్రాయింగ్, పెన్సిల్ షేడింగ్, పెన్ డ్రాయింగ్, కార్టూన్స్, పెయింటింగ్, హ్యాండ్ రైటింగ్, కాలిగ్రఫీ, పేపర్ క్విల్లింగ్, క్లే మౌల్డింగ్, మండాల ఆర్ట్, మైక్రో ఆర్ట్, లీఫ్ ఆర్ట్, ఫోటోగ్రఫీ, ఫోటోషాప్, డిజిటల్ పెయింటింగ్‌ల్లో నామమాత్రపు ఫీజుతో శిక్షణ తరగతులు జరుగుతాయని వివరించారు. ఆసక్తి ఉన్న వారు గాయత్రి నగర్, వాసిరెడ్డి శివరామకృష్ణయ్య వీధిలో ఉన్న తమ సంస్థలో నేరుగా కానీ 98493 55339, 93908 47433 నంబర్లలో కానీ సంప్రదించాలని కోరారు.

బొండా ఉమాకు డిపాజిట్లు దక్కవు



పూలు విక్రయించే మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి, నాయకులు



వినాయకనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ జానారెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈ సార్వత్రిక ఎన్నికల్లో సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బొండా ఉమాకు డిపాజిట్లు దక్కవని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఉమా ఫ్యామిలీ.. గుండాయిజానికి, రౌడీయిజానికి, కాల్ మనీ, సెక్స్ రాకెట్, బైక్ రేస్‌లకు కేరాఫ్ అడ్రస్ అని ఆరోపించారు. నియోజకవర్గ పరిధిలోని 25వ డివిజన్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ బంకా శకుంతలతో కలిసి డివిజన్‌లోని చుట్టుగుంట ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ బొండా ఉమాకు అభివృద్ధి, సంక్షేమం అంటే ఏమిటో తెలియదన్నారు. గుండాయిజం, రౌడీయిజం, కాల్ మనీ సెక్స్ రాకెట్, బైక్ రేసులు తప్ప అతని హయాంలో అభివృద్ధే జరగలేదన్నారు. 58 నెలల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో డివిజన్‌లో అభివృద్ధి బాగా జరిగిందన్నారు. ప్రతి రోడ్డు సీసీ రోడ్డుగా రూపుదిద్దుకుందన్నారు. సీఎం వైఎస్ జగన్ సహకారంతో కార్పొరేటర్ బంకా శకుంతల డివిజన్‌ను ఎంతో బాగా అభివృద్ధి చేశారని చెప్పారు. రాబోయే రోజుల్లోనూ ఇదే తరహాలో అభివృద్ధి కొనసాగిస్తామన్నారు. ఎన్నికల ప్రచారం విజయోత్సవ ర్యాలీలా సాగుతోందన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందన్నారు. అందుకే నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి ఘనస్వాగతం లభిస్తోందన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ఈ 58 నెలల పాలనలో ఎంతో అభివృద్ధి జరిగిందని తెలిపారు. అభివృద్ధి సంక్షేమం ఇకపై కూడా కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్పొరేటర్లు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

30వ డివిజన్‌లో ప్రచారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ వినాయకనగర్‌లో మంగళవారం కార్పొరేటర్ జానారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తూ ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని నాని, వెలంపల్లి శ్రీనివాసరావులను అఖండ మెజార్టీతో గెలిపంచాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాయిబాబా సేవలు ప్రశంసనీయం

సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ టి.విజయ్‌కుమార్ రెడ్డి



సాయిబాబా దంపతులను సత్కరిస్తున్న కమిషనర్ విజయకుమార్‌రెడ్డి, అధికారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమాచార, పౌర సంబంధాల శాఖలో ప్రచార సహాయకులు, దృశ్య శ్రవణ సూపర్‌వైజర్‌గా 33 సంవత్సరాల పాటు సుదీర్ఘ సేవలందించిన ఆగం సాయిబాబా ప్రభుత్వ ఉద్యోగులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ టి.విజయ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో ఆడియో విజువల్ సూపర్‌వైజర్ (ఏవీఎస్)గా పనిచేసి మంగళవారం పదవీ విరమణ చేసిన ఆగం సాయిబాబాకు ప్రభుత్వ అతిథి గృహ ఆవరణలోని డీఐపీఆర్వో కార్యాలయంలో మంగళవారం అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సభకు విజయ్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సాయిబాబా దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. 33 ఏళ్ల పాటు కాకినాడ, రాజమండ్రి, మచిలీపట్నం, విజయవాడలోని కార్యాలయాల్లో అలుపెరగని సేవలందించిన సాయిబాబా ప్రతిభను నేటితరం ఉద్యోగులు స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలన్నారు. దాదాపు 10 మందికి పైగా జిల్లా కలెక్టర్ల వద్ద పనిచేసి.. ప్రతి ఒక్కరితో శభాష్ అనిపించుకున్నారని చెప్పారు. ఆయన సేవలను భవిష్యత్తులో సమాచార శాఖ వినియోగించుకుంటుందన్నారు. కార్యక్రమంలో సమాచార శాఖ అదనపు సంచాలకులు ఎల్.స్వర్ణలత, సంయుక్త సంచాలకులు పి.కిరణ్‌కుమార్, టి.కస్తూరి, రీజనల్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ సీవీ కృష్ణారెడ్డి, డెప్యూటీ డైరెక్టర్ బి.పూర్ణచంద్రరావు, అసిస్టెంట్ డైరెక్టర్లు ఎం.భాస్కర్ నారాయణ, జీవీ ప్రసాద్, డీఐపీఆర్వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్వో ఎస్వీ మోహన్‌రావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, పబ్లిసిటీ సహాయకులు వీవీ ప్రసాద్, కమిషనర్, రీజనల్ జాయింట్ డైరెక్టర్ సహాయ సంచాలకులు, జిల్లా సమాచార శాఖ ఉద్యోగులు, సిబ్బంది హాజరయ్యారు.

వేడుకగా సంగీత కళాశాల వార్షికోత్సవం



వీణపై సంప్రదాయ కీర్తనలు పలికిస్తున్న విద్యార్థులు



సుమతీ రామ్మోనరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాల వార్షికోత్సవం కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలను సంగీత కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుభొట్ల కృష్ణవేణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంగీతం అభ్యాసం చేసిన ఎందరో విద్యార్థులు ఉన్నతస్థితిలో ఉన్నారని చెప్పారు. భరతనాట్యం అధ్యాపకురాలు భాగవతుల సౌమ్య భరతనాట్య బృందం సంప్రదాయంలోనూ, అజయకుమార్ బృందం కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను మనోహరంగా ప్రదర్శించారు. వయోలిన్ అధ్యాపకురాలు కృష్ణవేణి బృందం వయోలిన్‌పై పలు అంశాలను ప్రదర్శించారు. గాత్ర విభాగానికి సంబంధింది, లక్ష్మీనరసమ్మ, మల్లాది కార్తీక త్రివేణి, శోభాలక్ష్మి బృందాలు శాస్త్రీయ సంగీత విలువలను కాపాడుతూ పలు సంకీర్తనలు, దేశ భక్తి గీతాలు ఆలపించారు. వీణ అధ్యాపకురాలు మాధవి, మృదంగం అధ్యాపలు ఫల్గుణ్, స్టీవెన్‌రాజు, తబలా అధ్యాపకుడు అమృత కుమార్ తన విద్యార్థుతో పలు అంశాలను ప్రదర్శించారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత దండమూడి సుమతీ రామ్మోనరావును నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

సిద్ధార్థలో ఘనంగా శ్రీశ్రీ జయంతి



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఆధునిక భావజాలంతో కార్మికుల, కర్షకుల పక్షాన శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) నిలిచి ఎన్నో సాహిత్య రచనలు చేశారని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. సిద్ధార్థ కళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో శ్రీశ్రీ జయంతి వేడుకలు కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో మంగళవారం నిర్వహించారు. శ్రీశ్రీ చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ అగ్గిపుల్ల, కుక్కపిల్ల, సబ్బుబిళ్ళ కాదేదీ కవితకు అనర్హం అంటూ శ్రీశ్రీ మహాప్రస్థానంలోని కవితను చెప్పారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపకుడిగా ఆధునిక సాహిత్యాన్ని శ్రీశ్రీ ముందుకు నడిపారని కొనియాడారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల మాట్లాడుతూ శ్రీశ్రీ చేసిన రచనలను నేటి తరం యువత చదవాలన్నారు. సిద్ధార్థ కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎస్.శివకుమార్, తెలుగు విభాగం అధ్యాపకులు డాక్టర్ పి.నీరజ, డాక్టర్ ఎంవీ.రమణమూర్తి, జి.శేషారత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.